కాటేసిన యవ్వనం

టెంపోరావ్

కంట్రాక్టర్ గోపాలరావు ట్రంకాల్ చేసి వాలిగారితో మాట్లాడాడు. వాలిగారి మాటల్నిబట్టి అతను ఆయన్ని విశాఖపట్నానికి రమ్మన్నట్లు గ్రహించాను. ఆయన రిసీవర్ని పెట్టేసి, పడకకుర్చీలో వెనక్కి వాలారు. ఏదో చెప్తారని ఆయనవైపు చూస్తూ కూర్చున్నాను. ఆయన మాట్లాడకుండా చుట్ట కాల్చుకుంటూ వుండిపోయారు.

"వాలిగారూ, మీకు ట్రంకాల్ చేసింది గోపాలరావేనా?" అడిగాను.

"అవును," అన్నారాయన.

ఒక్కోసారి మనం అడిగిందాకా ఆయన మాట్లాడరు. ఆయన ఎప్పుడూ ఆలోచిస్తూ, వూహాలోకంలో జీవిస్తూ

వుంటారేమో!

"మిమ్మల్ని రమ్మన్నట్టున్నాడా?" అని వూహించుకున్నాను.

"బాగా వూహించావు. మనం కారులో వెళ్తున్నాం. రేపు తెల్లారుజామున బయల్దేరుదాం," అన్నారాయన.

"అతను దేనిలోనైనా ఇరుక్కున్నాడా?"

వాలిగారు పకపక నవ్వారు.

"ఎందులోనో ఇరుక్కుంటేగాని ఏ మనిషీ నాలాంటి డిటెక్టివ్‌ని రమ్మనడని అనేకమంది నీలాగే అనుకుంటారు. ఈసారి మనం వెళ్తున్నది అతడిని రక్షించడానికి కాదు, గిరీ, పెళ్ళవబోతున్న అతని కూతుర్ని దీవించడానికి," అన్నారాయన.

మద్రాస్ వచ్చి వారం రోజులైంది. నిజం చెప్పాలంటే యీ వారం రోజులూ మాకే పనీ లేదు.

కాని వాలిగారు పైకి తీరికలేనట్లు కనిపిస్తున్నారు. పోలీసు వుద్యోగులతో ఆయన మాట్లాడేవారు. సెంట్రల్ జైల్లో యావజ్జీవిత కారాగార శిక్ష అనుభవిస్తున్న ఒక హంతకుడితో ఆయన రెండు గంటలు మాట్లాడారు. అతడితో అంతసేపు దేన్నిగురించి మాట్లాడారో నాకు అర్థంకాలేదు. ఆయన మాట్లాడేటప్పుడు నేనక్కడలేను. తర్వాత దాన్నిగురించి నేనడిగితే ఆయన నవ్వి వూరుకున్నారు. అప్పట్లో నాతో చెప్పాలనే వుద్దేశం ఆయనకు లేదని గ్రహించాను.

"బయటవాళ్ళు నీకిచ్చేదే పనని అనేకమంది పొరబడ్తారు, గిరీ! నువ్వు కల్పించుకు చేసేది కూడా పనే!" అన్నాడాయన ఒకసారి నాతో, ఏ పనీ చేతిలోకి రాలేదని నేనగానే.

మర్నాడు విశాఖపట్నానికి బయల్దేరాం. ఆయన కూర్చున్నాను. XYZ కారును శరవేగంగా పోనిస్తున్నాను.

రాజమండ్రీ పట్నందాటి కారు ప్రయాణం చేస్తోంది. ఆయన ఏదో అమెరికన్ పత్రిక చదువుతున్నారు. చుట్ట పొగ గాల్లోకి ఎగుర్తోంది. ఒక పల్లెటూరు మెయిన్ రోడ్డమ్మట కారు వెళ్తోంది.

"గిరీ!" అన్నారాయన.

ఆయన సౌజ్ఞలనుబట్టి బ్రేకు నొక్కి కారును ఆపాను.

"ఇదే వూరు?"

"మేడపాడు."

"వెనక్కి పోనీ! చంద్రబాబుని చూడాలి," అన్నారాయన.

చంద్రబాబుతో నాకు పరిచయం లేదు. కారును వెనక్కి తిప్పి పోనిచ్చాను. రోడ్డు కిరువైపులా పాపులున్నాయి.

"ఎడం వైపుకి తిరుగు! దూరంలో కనిపిస్తున్న ఆ తెల్ల మేడ ముందు ఆపు," అన్నారాయన.

కాస్సేపట్లో మేడముందు కారు ఆపాను. మా కారును చూసి అరుగుమీద కూర్చున్న ఒక కుర్రాడు లోపలకు పరుగెత్తాడు. మేం ఇద్దరం కార్లోనే కూర్చుని వున్నాం.

లోపల్నుంచి ఒకతను మెట్లుదిగి నవ్వుతూ కారు దగ్గర కొచ్చాడు. వాలిగార్ని చూడగానే అతని కళ్ళు కాగడాల్లా ప్రకాశించాయి. పంచ, జుబ్బా ధరించాడతను. వయసు నలభై సంవత్సరాలు దాటి వుంటుంది. పొట్టిగా కత్తిరించిన క్రాపు. సన్నగా, పొడుగ్గా వున్నాడతను.

"అయ్యా, వాలిగారూ, మీరిలా వచ్చినందుకు ఎంత ఆనందంగా వుందో చెప్పలేను! రండి, దిగండి!" అన్నాడతను.

"దిగటానికి టైమ్ లేదు. ఈ పూరమ్మట కారు పోతూంటే నువ్వు గుర్తుకొచ్చావు. నిన్ను చూసి పోదామని వచ్చాను!"

"దయచేసి దిగండి. మీరు మా ఇంట్లో అడుగెట్టకుండా వెళ్ళిపోవడం ధర్మంకాదు," అన్నాడతను.

తలుపు తెరిచి ఆయన దిగారు. కారు దిగి వేగంగా ఆయన పక్కకి నడిచాను.

"ఇతను గిరి! నువ్వు మద్రాసులో నన్ను కలుసుకున్నపుడు ఇతను లేడు. బొంబాయి వెళ్ళాడు," అన్నారు వాలిగారు.

అతను నాకు నమస్కరించాడు. మెట్లెక్కి ముందు గదిలోకి వెళ్ళాం. విశాలమైన హాలు. వాలిగారూ, నేనూ సోఫాల్లో కూర్చున్నాం. అతను ఫాన్ స్విచ్చి తిప్పి లోపలకు వెళ్ళాడు. అతను ఒక స్త్రీతో కలిసి హాల్లోకి వచ్చాడు.

"నా భార్య కమల, వాలిగారూ," అన్నాడతను.

వాలిగారు నవ్వుతూ ఆమెకేసి చూశారు. ఏ అవతార పురుషుడినో చూస్తున్నట్లు ఆమె ఆయన్ని చూస్తూ నిలబడిపోయింది.

"అమ్మాయి, కూర్చో!" అన్నారాయన.

ఆమె భర్త వైపు తిరిగింది. ఇద్దరూ పెద్ద సోఫాలో కూర్చున్నారు. ఆమెను పరీక్షగా చూశాను. ఆమె మెళ్లో చాలా నగలున్నాయి. రెండు చేతులకూ డజన్ బంగారం గాజులున్నాయి. చెవులకు కమ్మలు. ఆమె మొహం

చూస్తే అమాయకురాలని తెలుస్తోంది.

"నా హోటల్ గదిలోంచి మాయమైన యాభైవేలూ రెండు గంటల్లో మీ వలన నాకు తిరిగొచ్చిందని చెప్తే కమల ఆశ్చర్యపోయింది సార్! అప్పటినుంచి మిమ్మల్ని చూడాలని కలలు గంటోంది! ఇవాళ దాని కల నిజమైంది," అన్నాడు చంద్రబాబు.

లోపల్నుంచి ఒక యువతి మా గదిలోకొచ్చింది. మాకు ప్లేట్లను అందించింది. ప్లేటులో వున్న జున్ను చూసి సంతోషించాను. గడ్డలా వుంది. చమ్చాతో దాన్ని కోసుకు తినాలి.

"మా ఆవులు రెండు నిన్నే యీనాయి సార్," అంది కమల.

"ఇటువంటి జున్ను పట్నాల్లో దొరకదు! పట్నాల్లోని ప్రజలు మంచి తిండికి దూరమైపోయారు," అన్నారు వాలిగారూ, జున్నును తింటూ.

ఆ యువతి మళ్ళా వచ్చింది. కంచాల్లో రెండేసి మామిడిపళ్ళను తెచ్చి ఆమె మాకు అందజేసింది. "మా తోటలో కాసిన చెరకు రసాలు!" అంది కమల.

నిజంగా అవి చెరకు రసాలే! తీయటి రసం! పండును నొక్కితే రసంతో నోరు నిండిపోతుంది. రెండు పళ్ళూ తినేశాను. టెంకల్నీ, తొక్కల్నీ కంచంలో వదిలేశాను. చేతులను కంచంలో కడుక్కున్నాం. ఆ యువతి ప్లేట్లను పట్టుకుపోయింది.

ఆరిపోయిన చుట్టను వాలిగారు వెలిగించి, పొగ వదుల్తూ ఎదురుగా కూర్చున్న దంపతులవైపు చూశారు. "అమ్మాయి,

చాలా థాంక్స్! మీరు నవ్వుతూ అనుమతిస్తే మేం బయ ల్దేరుతాం,'' అన్నారాయన.

భార్యాభర్తలిద్దరూ లేచి వాలిగారి ముందు కొచ్చారు. చంద్రబాబు ఆయన చెయ్యిని పట్టుకున్నాడు.

''వాలిగారూ, ఇవాళ యిక్కడ వుండి రేపు వెళ్లండి. మీరు మళ్ళీ యిటువైపు రారు,'' అన్నాడతను.

వాలిగారు చుట్టపొగ వదుల్తూ ఆలోచిస్తున్నారు. నేనైతే ''వుంటానని'' వెంటనే జవాబిచ్చేవాడిని. తిన్న జొన్న, చెరుకు రసాల రుచులు యింకా నాలికమీద మెదుల్తున్నాయి!

''వాలిగారూ, ఈసారి వచ్చినపుడు కనీసం ఒకరోజు మాతో వుంటానన్నారు మీరు!'' జ్ఞాపకం చేశాడతను.

''అలా అన్నమాట నిజమే!'' అన్నారాయన.

''పెద్దలు మాట తప్పరు!'' అంది కమల.

''అమ్మాయీ, నువ్వు జయించావు. ఉంటాను,'' అన్నారాయన.

ఆమె సంతోషంగా లోపలకు వెళ్ళింది. కాస్సేపట్లో మాకు చిక్కటి, స్ట్రాంగ్ కాఫీ వచ్చింది. నీళ్ళు కలపని పాలతో చేయడంవలన కాఫీ చాలా రుచికరంగా వుంది.

సాయంత్రం చంద్రబాబు మమ్మల్ని తన తోటకు తీసు కెళ్ళాడు. చాలా పెద్దతోట. వివిధ రకాల చెట్లూ తోటలో వున్నాయి. ప్రతి చెట్టునూ ఆసక్తితో చూస్తూ వాలిగారు కదుల్తున్నారు. పళ్ళు ఇంకా పెద్దవి అవడానికి ఏం ఎరువులు వెయ్యాలో ఆయన చంద్రబాబుకి చెప్పారు. చెట్లనూ, మొక్కల్నూ గురించి ఆయన కంతగా తెలుసని నేనంతవరకూ యెరుగను. ఆయన చెప్పిన కొన్ని విష యాలను చంద్రబాబు డైరీలో రాసుకున్నాడు.

జామిచెట్టుకింద వాలిగారు ఆగారు. మూడు దోర కాయల్ను కోసి చంద్రబాబుకీ, నాకూ ఇచ్చి ఒక టాయన కొరుక్కు తిన్నారు.

"ఇది ఒంటికి చాలా మంచిది!" అన్నారాయన.

తోటలో గడ్డినేలమీద కూర్చుని పాలికాపు తెచ్చి, నరికిచ్చిన ముంజికాయల గుంజును తిన్నాం. అటుపైన చంద్రబాబు సీతాఫలాలు తెప్పించాడు.

ఒక పండును వాలిగారు మధ్యకు విడదీశారు.

"చంద్రబాబూ, సీతాఫలాలు చాలా పురాతనమైనవి. వీటిలో గింజలు ఎక్కువగా వుంటాయి. ఈ మధ్య రిసెర్చి చేసి కొత్తరకం సీతాఫలాన్ని సృష్టించారు. దానిలో గింజలు ఇన్ని వుండవు. గుంజుతో నిండివుంటుంది. దాని విత్తనాలు నీకు పంపిస్తాను," అన్నారాయన.

చంద్రబాబు తన సంతోషాన్ని వెలిబుచ్చి, విత్తనాల కోసం ఎదురుచూస్తానన్నాడు.

సూర్యుడు అస్తమించాడు. చల్లటిగాలి వీస్తోంది. చిలకలు పాడుతూ మాపైనుంచి ఎగిరిపోయాయి. వాటివైపు సంతోషంతో చూశాను. చంద్రకాంతిలో గట్లమ్మట నడిచి ఇంటికి వెళ్తున్నాం. పొలాల్లో ఒకచోట పామును చూసి ఆగాను. టార్చి కాంతిలో వాలిగారు పామును పరీక్షించారు. "జెర్రిగొడ్డు! మనుషులను ఏమీ చెయ్యదు," అన్నారాయన.

చంద్రబాబు ఇంట్లో ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. పల్లెటూర్లో వున్నా ధనవంతుడైన చంద్రబాబు అన్ని సౌకర్యాలనూ సమకూర్చుకున్నాడు. డాబామీద ఓవర్ హెడ్ టాంక్ కట్టించాడు.

నూతిలోంచి ఎలక్ట్రిక్ మోటర్ టాంక్‌లోకి నీళ్ళను సంపు తుంది. బాత్‌రూమ్స్‌లో షవర్ అమర్చబడింది.

మేడమీదున్న గెస్టురూమ్‌లో రాత్రి నిద్రపోయాం. అది ఏర్‌కండిషన్డ్ గది! గదిలో పడుకుంటే పట్నంలో వున్నట్టుంది. ఆశ్చర్యంగా వాలిగారివైపు తిరిగాను.

"పట్నంలో వుండే సౌకర్యాలన్నీ యిక్కడున్నాయి," అన్నాను.

"పట్నంలో దొరకనివి ఇక్కడ ధారాళంగా లభి స్తాయి, గిరీ! మనం తిన్న గడ్డపెరుగు పట్నంలో దొర కదు! అక్కడ వ్యాపారదృష్టి ఎక్కువ. పాలు పితగ్గానే నీళ్ళు పోయకుండా పట్నంలోని మనుషులు వుండలేరు! తాజా కూరగాయలు యిక్కడ దొరుకుతాయి. చంద్ర బాబు ఎమ్మే పాసయి పల్లెలో వుండిపోయి వ్యవసాయం చేసుకుంటున్నాడు. మోజుపడి పట్నానికి పోలేదు!" అన్నారు వాలిగారు.

* * *

కోళ్ళు కూస్తున్నాయి. మేలుకుని పరుపుమీద కూర్చు న్నాను. ఆయన పరుపుకేసి చూశాను. వాలిగారు లేరు! నాకంటె ముందుగా లేచి ఆయన ఎక్కడికో వెళ్ళిపోయి వుంటారు.

మేడమెట్లు దిగి వీధిలోకి వెళ్ళాను. కారు వీధిలోనే వుంది. క్రిందటిరోజు మాకు టిఫిన్ అందించిన యువతి పాడుతూ వీధిలో ముగ్గులు పెడ్తోంది.

ఆమెకేసి నవ్వుతూ చూశాను. పదహారేళ్ళ పిల్ల! చూడ్డానికి అందంగా వుంది. ఆమె ధరించిన దుస్తులు అంత ఖరీదైనవి కావు. అయినా ఆమె శరీరం యవ్వన కాంతుల్తో మెరుస్తోంది.

నన్నామె చూసి సిగ్గుపడ్తూ పాడ్డం మానేసింది. తొందరగా ముగ్గుపెట్టేసి ఆమె లోపలకు వెళ్ళిపోయింది.

వీధమ్మట నడవసాగాను. పెద్ద ఇళ్ళను దాటిపోయాను, దూరంలో వంతెన కనిపిస్తోంది. వంతెనమీదకు నడిచాను. వంతెన వారగా నిలబడి కాలవకేసి చూశాను. నీళ్లు ప్రవహిస్తున్నాయి. బూట్ల చప్పుడయి వెనక్కు తిరిగాను.

ఆయనవైపు ఆశ్చర్యంగా చూశాను. ఆయన వంతెన అటువైపునుంచి పెద్ద అంగల్లో నడిచి వస్తున్నారు. నన్ను చూసి ఆగారాయన.

"గిరీ, పాపం సూరమ్మ కాలవలో మునిగి చనిపోయింది," అన్నారాయన.

"సూరమ్మెవరు?" అడిగాను.

"ఒకందమైన అమ్మాయి!" అని ఆయన కాలవ అటువైపు ఒడ్డుకేసి చెయ్యి చూపించారు.

పదిమంది ఒకచోట గుంపుగా నిలబడ్డారు.

"ఆమె శవం అక్కడుందా?"

"ఆమె నిన్నరాత్రి చనిపోయింది. శవాన్ని పోలీసులు పరీక్షకు పట్టుకుపోయారు," అన్నారాయన.

"మీరు యీ వూళ్లో వుండగా ఇంత జరిగినా వార్త మనకు చాలా ఆలస్యంగా అందింది, వాలిగారూ! పోలీసులు మిమ్మల్ని కల్సుకోకుండా పోయారు!"

"గిరీ, మనం అప్పుడు తోటలో వున్నాం! తోట పల్లెకు అటువైపునుంది!" అన్నారాయన.

మరోసారి గుంపుకేసి చూశాను. వాలిగారు పల్లెవైపు నడుస్తున్నారు. నేను వంతెన దాటి ఒడ్డు చేరుకున్నాను. గుంపుగా నిలబడిన వాళ్ళదగ్గరకెళ్లాను. నలుగురు మొగాళ్లు, ఆరుగురు ఆడాళ్ళు వున్నారక్కడ.

"ఇక్కడ ఏమైంది?" అడిగాను.

"సూరమ్మ కాలువలో మునిగిందయ్యా, చచ్చిపోయింది పాపం," అన్నాడొకడు.

"ఆమె తలిదండ్రు లెక్కడుంటారు?"

"తండ్రి లేడు. తల్లి బజ్జీలూ, పకోడాలూ అమ్మి బతుకుతోంది. పాపం, ఒక్కత్తే కూతురు," అన్నాడు మరొకతను.

"వాళ్ళ ఇల్లెక్కడ?"

"శివాలయం పక్కన! అరుగులమీద పొయ్యి, బూరెల మూకుడు మీకు కనిపిస్తాయి," అన్నాడు మూడో మనిషి.

కాలవ అంత వెడల్పుగా లేదు. కాలవలో ఒక గేదె యీదుతోంది. ఒక కుర్రాడు దాని వీపుమీద కూర్చుని వున్నాడు. ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించి వెనక్కి తిరిగాను.

చంద్రబాబు ఇంటికి చేరుకున్నాను. వాలిగారికి ఎదురుగా కమల, చంద్రబాబు కూర్చుని వున్నారు. ఆమె ముఖంలో విచారం గోచరిస్తోంది.

"వాలిగారూ, సూరమ్మ వృషార్త్రైన పిల్లండి! గత సంవత్సరమే అది పెద్దమనిషయింది," అంది కమల.

"కాలవలో ఆమె ఎందుకు మునిగి వుంటుంది? రాత్రిళ్లు ఎవ్వరూ స్నానం చెయ్యరే!" అన్నారాయన.

"కొందరు ఆమె ఆత్మహత్య చేసుకున్నది అంటున్నారా, సార్," అంది కమల.

"ఆత్మహత్యా? ఎందుకు?"

"పుస్తకాలు చదివి, సినిమాలు చూసి యువతులు ప్రేమలో పడ్డారండి," అందామె.

"ఆమె ఎవర్నైనా ప్రేమించిందా?" వాలిగారు ప్రశ్నించారు.

"అదంతా సుబ్బమ్మతో మాట్లాడితే మీకు తెలుస్తుంది. సుబ్బమ్మ దాని తల్లి. మగడు పోయాక బజ్జీలూ అవీ అమ్మి బతుకుతోందండి."

"సూరమ్మ ఎక్కడా పని చేయడం లేదా?"

"రెండు మూడు ఇళ్ళల్లో అది పని చేస్తోంది. డాక్టర్ చలపతి ఇంట్లో పనికి ఒప్పుకోవద్దని సూరమ్మతో నేనన్నాను. కాని అది వినలేదు."

"డాక్టర్ చలపతి మంచివాడు కాదా?"

"మంచివాడే వాలిగారూ! అయినా కుర్రాడు. పట్నంలో చదువుకుని ఇక్కడకొచ్చాడు. బ్రహ్మచారి. బ్రహ్మచారి, కన్యా ఒకచోటుండడం మంచిదికాదు, వాలిగారూ!" అందామె.

"అమ్మాయి బాగా చెప్పావ్! వాళ్ళలో ఏ క్షణంలో ఏం రగులుకుంటుందో చెప్పలేం! వయసులో వున్నవాళ్ళు ఆకల్ని ఆపుకోలేరు! ఆకలి వాళ్ళచేత నేరాలు చేయిస్తుంది," అన్నారు వాలిగారు.

గదిలో నిశ్శబ్దంగా వుంది. ఆ యువతి, ఆమె పేరు కనుక్కోవాలి, ప్లేటలో పెసరట్లు తెచ్చి మా కిచ్చింది. కొత్తిమిరి పచ్చడి నంచుకుంటూ అరడజను పెసరట్లు తిన్నాను. కమలా, చంద్రబాబూ ఎదురుగా కూర్చుని మమ్మల్ని రెచ్చగొట్టి ఎక్కువగా తినేటట్లు చేస్తున్నారు.

"వాలిగారూ, సూరమ్మకి ఏం జరిగిందో మీరు కనుక్కోండి సార్. అమాయకపు పిల్ల! అన్నెం పున్నెం ఎరుగనిది!" అంది కమల.

వాలిగారు విచిత్రంగా నవ్వారు.

"అమ్మాయి, కాలువలో పడి సూరమ్మ మరణించిందని వినగానే విశాఖపట్నం యివాళ వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాను. సూరమ్మ మరణం గురించి దర్యాప్తు చేస్తాను," అన్నారాయన.

వేడి కాఫీ తాగాం. వాలిగారు సోఫాలోంచి లేచారు చెయ్యి కడుక్కోడానికి. నేను స్నానాల గదిలోకి వెళ్ళాను. ఆ యువతి నాకు తువ్వాలిచ్చింది. ఆమెకేసి నవ్వుతూ చూశాను.

"నీ పేరు?" అడిగాను, తువ్వాలా మెకిచ్చేసి.

"లచ్చమ్మండి!" అని ఆమె పారిపోయింది.

ముందు గదిలో కొచ్చాను. వాలిగారి వెనకనే మెట్లు దిగాను. చంద్రబాబు మాతో వచ్చాడు. ముగ్గురం గోడ మ్మట నడిచాం. కొన్ని మలుపులు తిరిగి శివాలయం పక్కనున్న ఆమె ఆమె ఇంటిముందుకు చేరుకున్నాం.

అరుగుమీద పొయ్యి వుంది. కాని కట్టెలు కాలడం లేదు. లోపల గదిలోంచి ఏడుపు వినపడింది. చంద్రబాబు లోపలికెళ్ళాడు.

"లోకాన్ని అధరగొట్టే వాలిగారొచ్చారు. మీ అమ్మాయికి ఏమైందో ఆయన కనుక్కొంటారు," అన్నాడు చంద్రబాబు. వీధిలో నిలబడిన మాకు అతని మాటలు వినపడ్డాయి. ఆమె పెద్దకంఠంతో ఏడవసాగింది. వాలిగారు లోపలికెళ్ళారు. వెనకనే నేను మెల్లెక్కాను.

పెద్ద గది. గదిలో కుర్చీలు అవీ లేవు. నేలమీద కూర్చుని సుబ్బమ్మ ఏడుస్తోంది. ఆమె చుట్టూ యిరుగు పొరుగు వాళ్ళున్నారు. సుబ్బమ్మ తెల్లచీర కట్టుకుంది. ఆమె వయస్సు ముప్ఫయి అయిదుంటుందేమో! ఆమె

రవిక ధరించలేదు. చీర కొంగుతోనే తన స్తనాలను కప్పుకొంది.

వాలిగారు ఆమె కేసి సూటిగా చూశారు. ఆమె కళ్ళు తుడుచుకొంది.

"నీ కూతురు సూరమ్మ రాత్రివేళ కాలవొడ్డుకు ఎందు కెళ్ళింది?" అడిగారాయన.

"నాతో చెప్పలేదయ్యా!"

"ఆమె కాలవలో పడిందని నీ కెవరు చెప్పారు?"

"చిన్నబ్బాయి చెప్పాడయ్యా. ఆడు మా ఇంటి పక్కనే వుంటాడు."

"నువ్వు కాలవొడ్డుకు వెళ్ళావా?"

"వెళ్ళానయ్యా! వెళ్ళి చేసేదేముంది? దాన్ని లాగి ఒడ్డున పడేశారు. అప్పటికే ప్రాణం పోయింది. నేనెళ్ళి ఏడుస్తూ శవంమీద పడిపోయాను," అంది సుబ్బమ్మ.

చుట్ట పొగ వదుల్తూ ఆయన ఆమెవైపు సూటిగా చూశారు.

"ఆమె ఆత్మహత్య చేసుకుని వుంటుందా?"

"బంగారంలాటి పిల్ల ఎందుకు కాలవలో పడి చస్తుం దయ్యా? డాక్టర్ చలపతిగారు దాని బుఱ్ఱ పాడుచేసి వుంటారు. ఆయనింట్లో పని కెళ్ళొద్దని ఎంత చెప్పినా అది వినేది కాదు," అందామె.

"అతను ఏవిధంగా పాడుచేసి వుంటాడు?"

"చలపతిగారంటే దానికి మహా మోజయ్యా! తెల్లారు జామునే లేచి ఆయనింటికి పరుగెత్తేది!"

"చలపతితో మాట్లాడావా?"

"ఏం చెప్తారండాయన? ఆమె గురించి తనకేమీ తెలియదని తప్పించుకున్నారు! మొహంలో మాత్రం

విచారం చూపిస్తున్నారు!'' అంది సుబ్బమ్మ.

''నువ్వు నూరమ్మకి ఎందుకింకా పెళ్ళి చేయలేదు?''

''సుబ్బరాజు దాన్ని పెళ్ళాడ్తానని నాతో రోజూ చెప్పేవాడు. వాడు వడ్రంగి పని బాగా చేస్తాడు. డబ్బు సంపాదిస్తున్నాడు. ఇంటికి కొచ్చేవాడు. వాడిని చూసి అది వెకిలిగా నవ్వేది. వాడ్ని పెళ్ళాడ్డమేమిటి అనేది!''

''సుబ్బరాజు ఎక్కడుంటాడు?''

''రామసుబ్బయ్యగారి యింట్లో గది అద్దె కుచ్చుకుని వుంటున్నాడయ్యా,'' అంది సుబ్బమ్మ.

వాలిగారు మరే ప్రశ్నలూ అడగకుండా బయటకు నడిచారు. వీధిలో ఆయన నిలబడ్డారు. చంద్రబాబు ఏదో ఆయనతో చెప్తున్నాడు.

''గిరీ, ఇక్కడకు కారు తీసుకురా!'' అన్నారాయన.

నేను చంద్రబాబు ఇంటికి పరుగెత్తాను. కాస్సేపట్లో XYZ కారును వాళ్ళ పక్కనే ఆపాను. వాలిగారూ, చంద్రబాబూ ముందు సీటుమీద కూర్చున్నారు.

''సామర్లకోట వెళ్దాం,'' అన్నారాయన.

కారును స్టార్ట్ చేసి సామర్లకోట వైపు స్పీడుగా పోనిచ్చాను. గవర్నమెంట్ హాస్పిటల్ ముందు కారాపాను. వాలిగారు, చంద్రబాబు దిగారు. మేం ముగ్గురం లోపలకు వెళ్ళాం.

డాక్టర్ జోగారావు వాలిగారికి నమస్కరించాడు.

''నూరమ్మ అనే యువతి శవాన్ని పోలీసులు ఇక్కడకు పంపారని విన్నాను,'' అన్నారు వాలిగారు.

డాక్టర్ జోగారావు మమ్మల్ని ఒక గదిలోకి తీసుకు వెళ్ళాడు. పొడుగాటి టేబుల్ మీద తెల్లటి దుప్పటి

కప్పబడి వుంది. డాక్టర్ జోగారావు దుప్పటిని పూర్తిగా తీసేశాడు.

మా కళ్ళముందు సూరమ్మ శవం నగ్నంగా పడుకుని వుంది. ఆమె వయస్సు పదహారు లోపున వుంటుంది. పచ్చటి శరీరచ్ఛాయ. కడుపు ఇప్పుడు వుబ్బిలేదు! కళ్ళు మూసున్నాయి. వాలిగారు ఆమె గొంతునూ, కొంచెం పక్కకి కదిల్చి మెడనీ పరిశీలించారు. మెడమీద గాట్లు వున్నాయి. రెండు చోట్ల ఏదో గుచ్చుకున్నట్లుంది!

గాట్లను ఆయన పరీక్షగా చూశారు.

"డాక్టర్ ఎవరి గోళ్లో ఇక్కడ గుచ్చుకుని వుండాలి?" అన్నారాయన.

"అదే నేననుకున్నాను సార్," అన్నాడు డాక్టర్ జోగారావు.

"శవ పరీక్ష అయిందా?"

"అయింది సార్," అన్నాడతను.

బల్ల చివరకి నడిచి వాలిగారు ఆమె కాళ్ళను, పై భాగాన్ని పరీక్షించారు.

"వాలిగారూ, ఈ శవాన్ని గురించి కొన్ని విషయాలు నేను చెప్పగలను. ఈమెకు పెళ్ళికాలేదని విన్నాను, కాని ఈమె కన్యకాదు. గర్భవతి అని కూడా నా అనుమానం," అన్నాడు డాక్టర్ జోగారావు.

మౌనంగా గదిలోంచి వాలిగారు బయటకు నడిచారు.

అందరం కారు దగ్గరకు వెళ్ళాం.

"మిమ్మల్ని చూసినందుకు చాలా సంతోషిస్తున్నాను," అన్నాడు డాక్టర్ జోగారావు.

"అబ్బాయి, ఆ పిల్ల శవాన్ని చూశాక మనుషులను చూసి నాకు నవ్వాలనిపించడం లేదు. ఎవరో ఆమెను

బలవంతంగా నీళ్ళలో ముంచి నొక్కిపెట్టారు. తన ప్రాణాన్ని కాపాడుకోడానికి పాపం ఆమె చాలా యుద్ధం చేసింది. ఆ సమయంలో నొక్కిపట్టిన వాళ్ళ చేతి గోళ్ళు ఆమె శరీరంలోకి దిగాయి," అన్నారు వాలిగారు.

"అలా దిగుండొచ్చు, సార్," అన్నాడు డాక్టర్.

కారును పోనిచ్చాను. పోలీసుస్టేషన్ ముందు ఆపాను. వాలిగారు దిగి లోపలకు వెళ్ళారు. చంద్రబాబు కార్లోనే వుండిపోయాడు. నేను వాలిగార్ని లోపలకు వెంబడించాను.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తృళ్ళిపడుతూ లేచి నిలబడ్డాడు.

"వాలిగారూ, దయచేసి కూర్చోండి!" అన్నాడతను.

వాలిగారి పక్కనే నేనూ కూర్చున్నాను.

"సుబ్బారావు భాయ్, సూరమ్మ శవాన్ని చూశాను," అని వూరుకున్నా రాయన.

"పాపం, కాలవలో పడి చచ్చిందండి! ఆత్మహత్య చేసుకుందని అక్కడవాళ్ళు అనుకుంటుంటే విన్నాను!"

"ఆత్మహత్య ఎందుకు చేసుకుంటుంది? సూరమ్మకి కావలసినంత అందముంది! ఎక్కడేనా పనిచేసుకుని ఆమె సుఖంగా బతగ్గలదు!"

"ఆమె గర్భవతని డాక్టర్ అన్నాడు. ఎవడో ఆమెను నమ్మించి మోసం చేసుంటారు సార్," అన్నాడు ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు.

వాలిగారు అతనికేసి సూటిగా చూశారు.

"ఆమె ఒంటిమీద నగలూ అవీ లేవా?"

"చేతికి రెండు గాజులు, చెవులకు రింగులు వున్నాయి.

అవి గోల్డు కోటెడ్ వి. వాటిని మా దగ్గర వుంచాం,” అన్నాడతను.

“సూరమ్మను ఎవరో ఘోరంగా చంపారు. ఆ సమయంలో స్నానం చెయ్యడానికి ఆమె నదిఒడ్డుకు వెళ్లిందదు. ఎవరో ఆమెను నీళ్ళలోకి తోసి, నొక్కిపెట్టి చంపారు,” అన్నారు వాలిగారు.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆశ్చర్యంగా వాలిగారికేసి చూశాడు.

“వాలిగారూ, మీరు సహాయపడ్తే ఆమె హత్యకు కారకురాలెవరో తెలుస్తుంది,” అన్నాడు ఇన్‌స్పెక్టర్.

“ఇదేదో తెలిసిన దాకా నేను మేడపాడులోనే వుంటాను,” అని కుర్చీలోంచి లేచారు వాలిగారు.

* * *

డాక్టర్ చలపతి యువకుడు. అతను నవ్వుతూ మా వైపు చూశాడు. కాని లోలోపల అతను భయపడ్తూ వుండాలి! పాంటు, స్లాక్ ధరించాడతను. ఎడం చేతికి ఖరీదైన వాచ్ వుంది. అతని కన్సల్టింగ్ గదిలో వాలిగారూ, నేనూ కూర్చున్నాం.

“అబ్బాయి, మెడికల్ డిగ్రీ సంపాదించి నువ్వు యీ పల్లెటూరికి ఎందుకొచ్చావు?” ప్రశ్నించారాయన.

“ఒక చారిటీట్రస్టు నాకు స్కాలర్‌షిప్ యిచ్చింది సార్. వాళ్ళిచ్చిన డబ్బు సహాయంతో నేను ఎమ్. బి. బి. యస్. చదివి పాసయ్యాను. వాళ్ళ రూల్సు ప్రకారం కనీసం ఒక సంవత్సరంపాటు నేను ఏదో పల్లెటూరులో ప్రాక్టీసు పెట్టాలి,” అన్నాడు చలపతి.

“పల్లె ప్రజలకు సేవ చెయ్యాలనే వున్నతాశయంతో నువ్విక్కడకు రాలేదు!” అన్నారు వాలిగారు.

"వాలిగారూ, అటువంటి ఆశయాలు నాకూ వున్నాయి! అందువలననే అన్నివిధాలా పల్లెప్రజలకు సేవ చేస్తున్నాను," అన్నాడతను.

"సూరమ్మ ఇక్కడ పనిచేసేది!"

"అవును సార్. ఆమె హఠాత్తుగా కాలవలో పడి చనిపోయిందని విని ఆశ్చర్యపోయాను," అన్నాడతను.

"అబ్బాయీ, సూరమ్మ అందమైన పిల్ల. నువ్వు యువకుడవు. ఆమెకేమైనా ఆశలు చూపించి, అనుభవించావా?"

"వాలిగారూ!" అన్నాడతను, కాని అతని పెదిమలు వణుకుతున్నాయి.

"అబ్బాయీ, ఏ కారణం లేకుండా ఆమె కాలవలో పడి చావదు. ఆమె గర్భవతి! తల్లికి తెలియకుండా ఆమె ఇదంతా చేయగల్గింది."

"నాకేం తెలియదు సార్. ఆమె నా ఇంట్లో పనిచేసి వెళ్ళిపోయేది. నేను జీతం ఇచ్చేవాడిని. నెలకు పదిరూపాయిలు. సుబ్బరాజు వాళ్ళింటికి వెళ్తూ వుండేవాడని విన్నాను. వాడిని అడిగితే మీకు ఏదేనా తెలుస్తుందేమో!" అన్నాడతను.

వాలిగారు కుర్చీలోంచి లేచారు.

"ఆమె గురించి నాకేదేనా చెప్పదలిస్తే చంద్రబాబు యింటికి రా," అని బయటకు నడిచారాయన.

మరోసారి అతనివైపు చూశాను. అతనితో కరచాలనం చేశాను.

"డాక్టర్ చలపతీ, ఏదేనా వుంటే చెప్పడం మంచిది. ఎలాగైనా ఆయన కనుక్కుంటారు," అన్నాను.

"ప్లీస్, నన్ను ఆలోచించనివ్వండి!" అన్నాడతను, వేళ్ళతో నిమురుకుంటూ.

బయటకు వెళ్ళాను. వాలిగారు గబగబా నడుస్తున్నారు. కాస్సేపట్లో ఆయన పక్కకు చేరుకున్నాను.

సుబ్బమ్మ ఇంటి పక్కనున్న యింటికి వాలిగారు వెళ్ళారు. పదహారేళ్ళ కుర్రాడు మాకు ఎదురయ్యాడు.

"చిన్నబ్బాయి నువ్వేనా?" అడిగారాయన.

"అవునండి," అన్నాడతను.

"సూరమ్మ కాలవలోకి దూకటం నువ్వు చూశావా?"

"లేదండి. సూరమ్మ అక్కడ తిరుగుతూ వుండడం చూశాను."

"ఆమె అక్కడ ఒంటరిగా తిరుగుతోందా?"

"రాత్రిళ్ళు అక్కడెవరూ వుండరండి. పొలంనుంచి నేను కాలబడ్డమ్మట వస్తూన్నానండి. అప్పుడు ఆమెను చూశాను."

"తర్వాత నువ్వు ఎటు వెళ్ళావు?"

"నేను వంతెనకాడ మాట్లాడుతూ నిలబడ్డానండి."

"ఎవరేనా ఒంతెన దాటడం చూశావా?"

"డాక్టరబ్బాయిగారు నా పక్కనుంచి వెళ్ళారండి. ఆయన ఎక్కడికెళ్ళారో నేను గమనించలేదు."

"నువ్వు సూరమ్మ కాలవలో పడిందని సుబ్బమ్మకు ఎలా చెప్పావు?"

"కొంతసేపయ్యాక పైడిసెట్టి కొట్టుదగ్గర ఆ వార్త విన్నానండి. ఎవరు కాలవలో పడ్డారో నూద్దామని పరుగెత్తుకెళ్ళానండి. కొందరు దాన్ని లాగి ఒడ్డున పడేశారు. వెంటనే వెళ్ళి సుబ్బమ్మతో చెప్పానండి," అన్నాడు చిన్నబ్బాయి.

"వంతెన దగ్గర నువ్వు వుండగా ఆ ప్రాంతంలో తిరిగినవాళ్ళందర్నీ చూశావా?"

"చూశానండి. రామరాజు వెళ్ళాడు. కోటిలింగాలు రావడం చూశాను. సుబ్బరాజు గబగబా వెళ్తుంటే చూసాను."

"అతను ఎటు వెళ్తున్నాడు?"

"వంతెన దాటిపోతూంటే చూశాను సార్."

వాలిగారు నవ్వుతూ అతని భుజంమీద తట్టారు.

"సూరమ్మ నీ వయస్సుదే? చిన్నప్పుడు నువ్వూ, సూరమ్మా ఆడుకుని వుండాలి," అన్నారాయన.

"ఆడుకునేవాళ్ళమండి. పెద్దదైనాక అది మాకు దూరమైపోయింది," అన్నాడతను.

వాలిగారు వెనక్కి తిరిగారు. సుబ్బమ్మ యింటిముందు ఇద్దరం క్షణకాలం నిలబడ్డాం. ఎవ్వరూ ఏడ్వడంలేదు. మనిషిపోతే కొంతసేపు ఏడుస్తారు, తర్వాత జీవితం మామూలుగానే సాగిపోతూ వుంటుంది.

"వాలిగారూ, ఇప్పుడు మనం ఎక్కడికి పోదాం?"

"గిరీ, ఇది పట్నంకాదు, పల్లెటూరు. నాలుగే వీధులు. నడుద్దాం పద," అన్నారాయన.

ఒక ఇంటిముందు ఆయన ఆగారు. పెద్ద అరుగులు. గుమ్మంలో నిలబడిన స్త్రీ మావైపు చూసింది. మెట్లెక్కి గుమ్మం దగ్గరకు వెళ్ళాం. ఆమె మావైపు ప్రశ్నార్థకంగా చూసింది.

ఆమె పొడుగ్గా, లావుగా వుంది. సిగ చుట్టుకుని జుత్తులో మల్లెపూలు పెట్టుకుంది. నుదురుమీద రూపాయంత బొట్టుంది.

"రామసుబ్బయ్య యిల్లు యిదేనా?" అడిగారాయన.

"ఇదేనండయ్యా! మీ రెవరో ఊళ్ళోకొచ్చారని విన్నాను, రండి," అందామె.

లోపలకు వెళ్ళాం. పెద్ద గది. గదిలో కుర్చీలున్నాయి. ఇద్దరం కూర్చున్నాం. ఆమె దూరంగా మరో కుర్చీలో కూర్చుంది.

"మీ భర్త ఇంట్లో లేరా?" అడిగారు వాలిగారు.

"ఆయన తిరపతివెళ్ళి మూడేళ్ళు దాటింది. ఇంటికి తిరిగిరాలేదు. ఆయనకోసం యింకా ఎదురుచూస్తున్నా," అందామె.

"సుబ్బరాజు ఇక్కడుంటున్నాడని విన్నాను."

"సుబ్బరాజా? అతను బయటకెళ్ళాడు. కాస్సేపట్లో రావచ్చు," అందామె.

"నిన్నరాత్రి సుబ్బరాజు ఎక్కడికి వెళ్ళాడు?"

"అతను ఎక్కడకూ వెళ్ళలేదు సార్, ఇక్కడే వున్నాడు. రెండు కుర్చీలు పాడైతే వాటిని బాగుచేస్తూ వున్నాడు," అందామె.

"అతను కాలవదగ్గర కెళ్ళాడని విన్నాను. చిన్న బ్బాయి చెప్పాడు!"

"వాటి మాటలు నమ్మకండయ్యా! చిన్నబ్బాయి పచ్చి అబద్ధాలు చెప్తాడు!" అందామె.

అప్పుడే ఒకతను యీలపాట పాడుతూ మెట్లెక్కి గదిలోకొచ్చి మమ్మల్ని చూసి నిశ్శబ్దంగా వుండిపోయాడు. అతను బలంగా వున్నాడు. పంచ కట్టుకుని, పొట్టిచేతుల స్లాక్ వేసుకున్నాడు. మనిషిలో అందం లేకపోయినా, అతని శరీరం గట్టిగా వుంది!

"రాజూ, వీళ్ళు నీకోసమే వచ్చారు!" అందామె.

అతను ఒక స్టూల్ మీద చతికిలబడ్డాడు.

"సూరమ్మ గురించి నీతో మాట్లాడ్డానికొచ్చాను," అన్నారు వాలిగారు.

"అమాయకురాలు కాలవలో పడి చచ్చింది. నన్ను పెళ్ళాడుంటే పువ్వుల్లో పెట్టి పూజించేవాడిని," అన్నాడతను.

"నువ్వు పెళ్ళాడా లనుకున్నావు, కాని ఆమెకా అదృష్టం లేదు!" అందామె.

"నువ్వూరుకో, పారిజాతం? ఆమె పోయిందని విన్నాక నే నెంత బాధపడ్తున్నానో నీకు తెలియదు! ఆ డాక్టర్ వెనుకబడి జీవితాన్ని పాడు చేసుకుంది!" అన్నాడతను.

"అబ్బాయి, డాక్టర్ చలపతితో ఆమెకు సంబంధ ముందని అంటావా?"

"అతనంటే నా కెంతో ప్రేమ సార్. నేను వాళ్ళ ఇంటికి వెళ్ళేవాడిని. నాకేసి చిన్నచూపు చూసేది. తను కుర్చీలు చేసేవాడి పెళ్ళాం కాడానికి పుట్టలేదంది. అలా అన్నా నే నేమీ అనలేదు. ఎప్పుడో మనసు మారి నన్ను పెళ్ళాడుతుందని వూరుకున్నాను. సంవత్సరం అయ్యాక డాక్టర్ వెళ్ళిపోతాడు. అటుపైన దానికి బుద్ధి వస్తుందనుకున్నాను."

"డాక్టర్ చలపతితో జాగ్రత్తగా వుండమని ఆమెను నువ్వు హెచ్చరించావా?" అడిగారాయన.

"నేను చెప్పినా ఆమె వినిపించుకునేది కాదు. ఆమె దృష్టిలో డాక్టర్ చలపతి దేముడులాంటివాడు. అతడిని గురించి ఆమె కలలు కనేది!"

"అబ్బాయి, నిన్నరాత్రి నువ్వు బయటకు వెళ్లావా?" అడిగారు వాలిగారు.

"లేదు సార్. పారిజాతంగారు రెండు కుర్చీలు పడేసి రిపేరు చెయ్యమన్నారు. వాటిని బాగుచేస్తూ ఇక్కడే వున్నాను," అన్నాడతను.

"నువ్వెంతవరకూ ఇక్కడున్నావు?"

"నేను పని ముగించేసరికి పది దాటింది, సార్," అన్నాడతను.

వాలిగారు వేరే ప్రశ్నలు అడగలేదు. ఆయన వీధిలోకి వెళ్ళారు. నేను ఆయన ప్రక్కకు చేరుకున్నాను.

"గిరీ, మనం కల్సుకున్నవారందరూ ఏదో దాస్తున్నారు. డాక్టర్ చలపతి నిజం చెప్పడంలేదు. సుబ్బరాజూ ఏదో దాస్తున్నాడు," అన్నారు వాలిగారు.

ఇద్దరం చంద్రబాబు ఇంటికి చేరుకున్నాం.

* * *

తెల్లారింది. ఆవులిస్తూ పరుపుమీద లేచి కూర్చున్నాను. వాలిగారు ఎక్కడికో వెళ్ళడానికి తయారవుతున్నారు. గబగబా దుస్తులు మార్చుకున్నాను. మెట్లు దిగి వీధమ్మట నడుస్తూన్న ఆయన్ని కల్సుకోగల్గాను.

"గిరీ, బాగా నిద్ర పట్టిందా?" అడిగారాయన.

"అఖండంగా నిద్రపోయాను," అన్నాను.

ఆయన గంభీరంగా నవ్వారు.

"గిరీ, నువ్వు రాత్రి పలవరించావు! కోర్కెలకు బానిసైన మనిషి సుఖంగా పడుకోలేడు," అన్నారాయన.

"నాకు ఏ కోరికలూ లేవు! వాలిగారూ, మీతో వుంటే నాకెంతో ఆనందంగా వుంది," అన్నాను.

"నాతో వుంటే నీకు ఆనందంగా వుంటుందని నాకు తెలుసు! గిరీ,నూరమ్మ శవాన్ని నగ్నంగా నువ్వు చూశావు.

ఆమెను గురించి ఆలోచిస్తూ నిద్రపోయి వుంటావు!'' అన్నారాయన.

''ఆమె చాలా అందంగా వుంది!'' అన్నాను.

''గిరీ, అందమైన యువతులు అనేక విధాలుగా బలై పోతారు! సూరమ్మ అందంగా లేకపోతే సుఖంగా జీవిస్తూ వుండేది! అందం ఆమెకు ఒక విధంగా శత్రువైంది!'' అన్నారాయన.

డాక్టర్ చలపతి యింటిముందు ఆగాం. వాలిగారు లోపలకు వెళ్లారు. ఆయన వెనుకనే నేనూ వెళ్ళాను. కన్సల్టింగ్ రూమ్‌లో వున్న చలపతి మావైపు గాభరాగా చూశాడు.

''వాలిగారూ, మీ దగ్గరకు వద్దామనుకుంటున్నాను,'' అన్నాడతను.

''ఎందుకు?''

''మీతో నిజం చెప్పాలని నా ఆశ,'' అన్నాడతను.

''నిజం చెప్పడం యెప్పుడూ మంచిది!'' అన్నారాయన.

''వాలిగారూ, మా ఇద్దరి హృదయాలూ కలిశాయి. మాకు అన్నివిధాలా సంబంధం ఏర్పడింది. నేను చదువుకున్నవాడిని. ఆమె పనిమనిషి. దాన్ని నేను ఈమధ్య గుర్తించాను. నా మూలంగా ఆమె గర్భవతి అయింది, కాని నేనామెను వివాహమాడలేను! ఒకరోజు అదంతా ఆమెతో నేను చెప్పాను. తనని నేను మోసగిస్తున్నానని ఆమె అనుకుంది. ఆమెను మోసం చేయాలనే దృష్టి నాకు లేదు! నేను డాక్టర్ని. ఆమె ఎక్కువగా చదువుకోలేదు. ఆమెతో నేను సుఖంగా వుండలేను. ఒకప్పుడు మేం దగ్గరయ్యాం. ఆమె గర్భవతి అయింది. ఆమెకు అయిదువేలు

యిస్తానని నే నన్నాను! ఆమె నవ్వుతూ వెళ్ళి పోయింది!" అన్నాడు చలపతి.

"అబ్బాయి, మొన్న రాత్రి నువ్వు కాలవ ఒడ్డుకు వెళ్ళావా?"

"వెళ్ళాను," అన్నాడతను.

"ఎందుకెళ్ళావు?"

"ఆమె నన్ను అక్కడ కలుసుకోమంది. నాతో ఏదో మాట్లాడాలంది."

"ఆమెను కలుసుకున్నావా?" అడిగారాయన.

"కాలవదాకా వెళ్ళేసరికి నాకు ధైర్యం లేకుండా పోయింది. నేను కాస్సేపు అటూ యిటూ తిరిగి ఇంటికి వచ్చేశాను," అన్నాడు చలపతి.

"కాలవ ఒడ్డుమీదున్న ఆమెను నువ్వు చూశావా?"

"తెల్లారాక ఆమె నా ఇంటికొస్తుందనుకున్నా. ఆమె అలా మరణిస్తుందని నేను వూహించలేదు," అన్నాడతను.

"చలపతీ, కాలవ ఒడ్డున కల్సుకోమని ఆమె నీతో ఎందుకు చెప్పింది?" అడిగారు వాలిగారు.

"అదే నాకు తెలియలేదు. నా ఇల్లు పెద్దది. ఆమె నాతో యిక్కడే మాట్లాడొచ్చు. అయినా ఆమె నన్ను కాలవ వడ్డుకు రమ్మంది!" అన్నాడతను.

"అబ్బాయి, నువ్వామెను చంపలేదా?"

డాక్టర్ చలపతి కళ్ళమ్మట నీళ్ళు కారాయి.

"వాలిగారూ, జరిగినదానికి విచారిస్తున్నాను. ఆమెను నే నెందుకు చంపుతాను! సూరమ్మ చాలా మంచిది. ఆమంటే నాకు చాలా ఇష్టం. కాని ఆమెను నేను పెళ్ళాడ లేను. పనిమనిషి డాక్టర్ భార్య అని అందరూ నవ్వుతారు!" అన్నాడతను.

"సుబ్బరాజును గురించి ఆమె నీతో ఏదేనా చెప్పిందా?"

"తనంటే సుబ్బరాజుకి పిచ్చని ఆమె నాతో అంది. ఏ స్థితిలో వున్నా తనని సుబ్బరాజు పెళ్ళాడతాడని ఆమె నమ్మకం!"

"సుబ్బరాజుని ఆమె కాలవ ఒడ్డుకు రమ్మందేమో!" అన్నారాయన.

"అది నాకు తెలియదు, సార్," అన్నాడు చలపతి.

కన్సల్టింగ్ రూమ్‌లోంచి వాలిగారు బయటకు నడిచారు. ఇద్దరం వీధిలో నడుస్తున్నాం.

"వాలిగారూ, సుబ్బరాజు కసితో ఆమెను చంపి వుండొచ్చు," అన్నాను.

ఆయన ఫక్కున నవ్వారు.

"గిరీ, సుబ్బరాజుకు ఆమంటే ప్రాణం. అంతగా ప్రేమించే సుబ్బరాజు ఆమెను చంపడు," అన్నారు వాలిగారు.

* * *

భోజనం చేస్తున్నాం. కమల స్వయంగా వడ్డిస్తోంది.

"వాలిగారూ, సూరమ్మ విషయం ఏదేనా తెలిసిందా?" అడిగిందామె.

"అమ్మాయి, సూరమ్మ కాలవలో మునిగి చావలేదు. ఆమె ఘోరంగా హత్యచేయబడింది," అన్నారాయన.

"ఆమెను ఎవరు చంపారు?" అందామె.

"అదింకా నేను కనుక్కోవాలి," అన్నారు వాలిగారు.

చంద్రబాబు నవ్వుతూ వాలిగారికేసి చూశాడు.

"డాక్టర్ చలపతి దేవాంతకుడు, సార్. అతని దగ్గరకు ఎవ్వరూ వైద్యానికి వెళ్ళరు! ఇది పల్లెటూరు. పల్లెటూరిలో ఎవ్వరూ ఆడవాళ్ళను డాక్టర్ చలపతి దగ్గరకు పంపరు. బ్రహ్మచారంటే అందరికీ భయం!" అన్నాడు చంద్రబాబు.

వాలిగారు అతనివైపు సూటిగా చూశారు.

"చంద్రబాబూ, డాక్టర్ చలపతి చెడ్డవాడు కాదు. ప్రతి బ్రహ్మచారీ చెడ్డవాడని మనం అనుకోకూడదు," అన్నారాయన.

"వాలిగారూ, సూరమ్మను ఎవరు చంపారో కనుక్కోండి? వాడిని ఉరి కంబానికి పంపండి," అంది కమల.

"అమ్మాయి, పరిశోధన సాగిస్తున్నాను. హంతకుడు తాత్కాలికంగా దాక్కున్నా శాశ్వతంగా దాక్కోలేడు! ఎప్పుడో అప్పుడు అతను బయటపడ్తాడు," అన్నారు వాలిగారు.

"వాలిగారూ, చలపతినే కాదు, సుబ్బరాజుని కూడా మీరు అనుమానించాలి? అతను పైకి వెర్రిపీనుగలా కనిపించినా, లోలోపల దుర్మార్గుడు," అంది కమల.

"అతడిని గురించి నీకేదైనా తెలుసా?"

"సుబ్బరాజు మనస్ఫూర్తిగా సూరమ్మను ప్రేమించాడు. కాని ఆమె అతడిని లెఖ చేయకుండా డాక్టర్ చలపతితో తిరిగేది! మనిషికి అది చూస్తే కసి పుట్టుకొస్తుంది," అందామె.

వాలిగారు జవాబివ్వలేదు. భోజనం చేసి చేతులు కడుక్కున్నారు. పడకకుర్చీలో కొంతసేపు చుట్ట పీలుస్తూ కూర్చున్నారు. అమాంతంగా ఆయన కుర్చీలోంచి లేచారు.

"గిరీ!" పిల్చారాయన.

"చెప్పండి," అన్నాను.

"నేను పొరబడ్డాను," అన్నారాయన.

"ఏ విషయంలో?"

"నేను వూహించిందంతా నిజం కాదు. డాక్టర్ చలపతి, సుబ్బరాజు ఆమెను చంపి వుండరు," అన్నారాయన.

"అయితే ఆమె ఆత్మహత్య చేసుకుందా?"

"లేదు!" గర్జించారు వాలిగారు.

"అయితే ఏమైంది?"

"అది నాకు యిప్పుడే తట్టింది. దాన్ని గురించి నేనింత వరకూ ఆలోచించనందుకు విచారిస్తున్నాను. గిరీ, వెళ్దాం పద?" అన్నారాయన.

"ఎక్కడికి?"

ఆయన జవాబివ్వలేదు. గబగబా మెట్లు దిగాడు. ఆయన వెనకనే నేను పరుగెత్తాను.

* * *

సుబ్బరాజు గాభరాగా వాలిగారివైపు చూశాడు.

"అబ్బాయీ, నువ్వు కాలవ ఒడ్డుకు వెళ్ళావు. నువ్వు సూరమ్మను కలుసుకున్నావు!" అన్నారు వాలిగారు.

అతను మాట్లాడలేదు. మౌనంగా వున్నాడు.

"నిన్ను ఆ ప్రాంతంలో చూసినవాళ్ళు వున్నారు!" గర్జించారు వాలిగారు.

"నేను వెళ్ళాను సార్," అన్నాడతను.

"ఎందుకు వెళ్ళావు?"

"ఆమె నన్ను అక్కడకు రమ్మని కబురు పంపింది. నాతో అత్యవసరంగా మాట్లాడాలంది," అన్నాడతను.

"ఆమెను కలుసుకున్నావా?"

"ఆమెతో మాట్లాడాను. తను గర్భవతినని ఆమె నాతో చెప్పింది. అయినా ఆమెను పెళ్ళాడతానని నే నన్నాను. ఆమె ఏడ్చింది," అన్నాడతను.

"అటుపైన ఏం చేశావు?"

"నేను ఇంటికి వెళ్ళిపోయాను. ఆమె యింటికి పోతా నంది. తల్లితో మా పెళ్ళిగురించి మాట్లాడతానంది," అన్నాడతను.

వాలిగారు అతనికేసి సూటిగా చూశారు.

"అబ్బాయి, అయితే నువ్వు ఇక్కడే వున్నానని నాతో అబద్ధం ఎందుకు చెప్పావు?"

"పారిజాతం అలా చెప్పమంది సార్! ఆనాటి రాత్రి నేను ఇంటికొచ్చేసరికి ఆమె లేదు. అరగంట తర్వాత ఆమె వచ్చింది. సూరమ్మ కాలవలో మునిగి చచ్చిందని ఆమె నాతో చెప్పింది. పోలీసులు నన్ను అనుమానిస్తారని ఆమె అంది. అబద్ధం చెప్పి నన్ను కాపాడుకోమంది. అందుకని అలా చెప్పాను," అన్నాడు సుబ్బరాజు.

తలుపుమీద వాలిగారు తట్టారు. కాస్సేపట్లో తలుపు తెరవబడింది. పారిజాతం కళ్ళు నులుపుకుంటూ మావైపు చూసింది.

"మీరు నిద్ర పోరా?" అందామె.

"నిజం తెలిసిందాకా మాకు నిద్ర పట్టదు," అన్నారు వాలిగారు.

"నాతో మీకేం కావాలి? నన్నెందు కిప్పుడు లేపారు?" అర్చిందామె.

వాలిగారు చుట్టపొగను పైకి వదిలారు. ఆమెకేసి సూటిగా చూశారు.

"సూరమ్మను ఎందుకు చంపావు?" అడిగారాయన.

ఆమె ఉలిక్కిపడింది. కాస్సేపు ఆమె నిశ్శబ్దంగా వుండిపోయింది.

"పారిజాతం, తిరుపతి వెళ్ళిన నీ భర్త తిరిగి రాలేదు. సుబ్బరాజుకు గది అద్దెకిచ్చి వుండమన్నావు. అమాయకుడైన అతడిని మెల్లిగా మచ్చిక చేసుకున్నావు! అతని హాస్తాల్లో నీ జీవితం హాయిగా సాగుతోంది!"

"వాలిగారూ, ఇదంతా అబద్ధం. నేను పెళ్ళయిన స్త్రీని. నన్ను అవమానిస్తున్నారు," అర్చిందామె.

సుబ్బరాజుగదిలోకొచ్చాడు.

"అబ్బాయి, మీ యిద్దరికీ సంపర్కముందా?" అడిగారాయన.

అతను తలాడించాడు. పారిజాతం అతనివైపు కోపంతో చూసింది.

వాలిగారు ఆమె ముందుకు వెళ్ళి నిలబడ్డాడు. ఆమె కేసి కళ్ళెర్రజేసి జూశారు.

"డాక్టర్ చలపతిని వదిలేసి సూరమ్మ సుబ్బరాజును పెళ్ళాడబోతోందని నువ్వు విన్నావు."

"అది నేనే ఆమెతో చెప్పాను," అన్నాడు సుబ్బరాజు.

"అతనికి పెళ్ళయితే సుబ్బరాజు నీకు లేకుండా పోతాడు. వెంటనే కాల ఒడ్డుకి వెళ్ళావు. సుబ్బరాజు అప్పటికప్పుడే ఆమెతో మాట్లాడి వెళ్ళిపోయాడు. ఇంటికి పోడానినికి సూరమ్మ సిద్ధమవుతోంది. నువ్వామెను కాలవలోకి తోసి, నొక్కిపెట్టావు! ఆమె మరణించాక నీ ఇంటికి పరుగెత్తావు!"

"కథ బాగుంది, ఇంకా చెప్పండి," అందామె.

"ఇంట్లో సుబ్బరాజు వున్నాడు. సూరమ్మ చనిపోయిందని అతనితో చెప్పావు. నిన్ను రక్షించుకోడానికి మంచి ఆలోచన తట్టింది నీకు. కాలవ వద్దకి సుబ్బరాజు వెళ్ళాడని నీకు తెలుసు. దాని మూలంగా యీ హత్యకేసులో తను ఇరుక్కోవచ్చని సుబ్బరాజును భయపెట్టావు. అమాయకుడైన సుబ్బరాజు నీ మాటలు విని గాభరాపడ్డాడు. అతను చేతుల్తో పని చేసే వడ్రంగి. నీలాటి పదునైన బుర్ర అతనికి లేదు. ఏం చేయాలని అతను నిన్ను అడిగాడు. కుర్చీలు బాగుచేస్తూ యింట్లో కూర్చున్నానని అతడిని చెప్పమన్నావు. అతను యింట్లో వున్నాడని నువ్వు సాక్ష్యమిచ్చావు. మీ ఇద్దరూ ఒకే విధంగా చెప్పినందువలన మొదట్లో మీ మాటలు నేను నమ్మాను. కాని తర్వాత అసలు రహస్యం నాకు అర్థమైంది. నువ్వు అతడిని చెప్పమన్న అబద్ధం ఒక వైపున అతడిని కాపాడ్తూ మరో వైపున నిన్ను కాపాడ్తోంది! మీరిద్దరూ ఇక్కడున్నారు! అతని సాక్ష్యం మూలంగా నిన్నెవరూ అనుమానించరు అనుకున్నావు!" అర్నాబ్ రాయన.

పారిజాతం లోపలి గదిలోకి పరుగెత్తింది. సుబ్బరాజు వాలిగారివైపు చూశాడు. అతని కళ్ళు జేవురించినట్లున్నాయి.

"వాలిగారూ, ఈమె నిజంగా సూరమ్మను చంపిందా?" అడిగాడతను.

"నిస్సందేహంగా!" అన్నారు వాలిగారు.

"దాని తోలు ఒల్చేస్తాను," అని అతను లోపలకు పరుగెత్తాడు.

"వాలిగారూ, మనం ఆపకపోతే మరో హత్య జరుగుతుంది," అన్నాడు.

లోపల గదివైపు వెళ్ళబోయాను. వాలిగారు నా చెయ్యి పట్టుకుని ఆపారు. ఆయన మెల్లిగా లోపలకు వెళ్ళి గుమ్మం బయట నిశ్శబ్దంగా నిలబడ్డారు. ఆయన పక్కనే నేనున్నాను. గదిలోంచి వాళ్ళ మాటలు మాకు వినపడుతున్నాయి.

"దొంగ ముండా, నన్ను శాశ్వతంగా వుంచుకోడానికి సూరమ్మను ఘోరంగా చంపావా?" అర్చాడు సుబ్బరాజు.

ఆమె ఏడుస్తోంది.

"రాజూ, నువ్వు నా ప్రాణం! రెండేళ్ళనుంచి యిక్కటున్నావు. నీకు నేను అన్ని సేవలూ చేస్తూ వచ్చాను. నిన్ను నేను వదులుకుని జీవించలేను!" అందామె.

"నువ్వు నాకంటె పెద్దదానవు. మంచి మాటలాడుతూ నా శరీరంతో ఆడ్డం ప్రారంభించావు. నువ్వు నామీదకు వస్తూంటే నేను ఆగలేకపోయాను. అయినా ఇంత ఘోరమైన హత్య చేస్తావని నేను కల్లో కూడా అనుకోలేదు." అన్నాడతను.

"వాళ్ళ మాటలు నమ్మకు. సూరమ్మను డాక్టర్ చలపతి చంపుంటాడు? నాకు తెలుసు!" అందామె.

సుబ్బరాజు ఆమె చంపల్ను వాయిస్తున్నాడు. ఆమె అరుస్తోంది.

"నిజం చెప్పు!" అర్చాడతను.

"రాజూ, నేను ఆమెను చంపాను. నీకోసం దాన్ని చంపవలసి వచ్చింది. నీ బలహీనత నాకు తెలుసు.

సూరమ్మ బతికుంటే నువ్వు దాన్ని మర్చిపోవు! ఆమె నిన్ను పెళ్ళాడ్డానికి నిశ్చయించుకొంది! నాకు శాశ్వతంగా నువ్వు దూరమైపోతావు! నేను పొందుతున్న ఆనందమంతా గాలిలో ఎగిరిపోతూంటే చూస్తూ వూరుకోలేక ఆమెను తుదముట్టించాను!"

"దొంగ ముండా." అంటూ అతను ఆమెను బాదుతున్నాడు.

తటాలున వాలిగారు లోపలకు జొరబడ్డారు. బలంగా పట్టుకుని సుబ్బరాజును వెనక్కి లాగారు.

"అబ్బాయి, హంతకులను శిక్షించడం నీ వంతు కాదు. అందుకోసం దేశంలో కోర్టులున్నాయి," అన్నారాయన.

గుమ్మంలో నిలబడిన నాకు వాలిగారు సౌజ్ఞ చేశారు. గట్టిగా విజిల్ వూదాను. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు అరడజను మంది కానిస్టేబుల్సుతో గదిలోకొచ్చాడు.

"సుబ్బారావు భాయ్, సూరమ్మను చంపింది ఈమే! పారిజాతం!" అన్నారు వాలిగారు.

ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆమె చేతులకు బేడీలు వేశాడు.

"సుబ్బరాజు సాక్ష్యం మీకు చాలా వుపయోగపడ్తుంది," అన్నారాయన.

వాలిగారూ, నేనూ బయటకు నడిచాం. ఇన్‌స్పెక్టర్ మా వెనకనే వచ్చాడు.

"చంద్రభాబు ఇంట్లో మీరు వుంటారుగా? ఇక్కడి పని పూర్తిచేసి అక్కడ కొస్తాను," అన్నాడతను.

"సుబ్బారావు భాయ్, గంటలోపల రా! ఇక్కడ మా పని పూర్తయింది. విశాఖపట్నానికి బయల్దేరాలి," అన్నారు వాలిగారు.

వీధమ్మట ఇద్దరం వేగంగా నడుస్తున్నాం.

"వాలిగారూ, మీరు పారిజాతాన్ని ఎలా అనుమానించారు?" ప్రశించాను.

ఆయన తీయగా నవ్వుతూ నాకేసి చూశారు.

"గిరీ, ఆమె కళ్ళలోంచి వాంఛలు తొంగిచూస్తున్నాయి! భర్త యింట్లో లేకపోయినా ఆమె పూలతో అలంకరించుకొని రంభలా ముస్తాబైంది! తన యింట్లో వుండే బ్రహ్మచారి సుబ్బరాజును ఆమె నిద్ర పోనివ్వదని ఊహించాను! సుబ్బరాజు అమాయకుడు. ఎవరేం చెప్పినా నమ్మేస్తాడు! బొమ్మలా అతడిని ఆడించసాగిందామె!" అన్నారు వాలిగారు.

* * *

నేను సామాను సర్దుతున్నాను. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు గదిలోకొచ్చాడు.

"వాలిగారూ, ఆఖర్కి ఆమె ఒప్పుకుని అంతా వివరంగా చెప్పింది," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏం చెప్పిందామె?" అడిగా రాయన.

"ఆమె కాలవ్వద్దకి వెళ్ళింది. సూరమ్మ చూస్తూండగా కాలవలోకి దిగింది. చేతులు పైకెత్తి చంద్రనమస్కారాలు చేస్తూ నిలబడింది. అదంతా ఎందుకని సూరమ్మ అడిగిందట. పౌర్ణమి చంద్రుడికి నమస్కారాలు పెట్టుకుంటే కోర్కెలన్నీ తీర్తాయని చెప్పింది పారిజాతం. ఆ మాటలు విని, వాటిని నమ్మి సూరమ్మకూడా నీళ్ళలోకి దిగింది. ఇద్దరు పక్కపక్కనే వున్నారు. అప్పుడు పారిజాతం తన రెండు చేతుల్తోటీ ఆమెను నీళ్ళలోకి నొక్కేసింది. సూరమ్మ విదిలించుకోడానికి ప్రయత్నించింది కాని, పారి

జాతం చాలా బలమైనది! ఆ సమయంలో ఆమె గోళ్ళు సూరమ్మ మెడకింద గుచ్చుకున్నాయి,'' అన్నాడు ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు.

గదిలో వున్న కమల, చంద్రబాబు ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు చెప్పినదంతా విన్నారు.

''రామసుబ్బయ్య ఆమె చేతుల్లో బొమ్మలా పడుండే వాడు. పగలూ, రాత్రీ ఆమె అతడిని వదిలేది కాదని పుకార్లు వున్నాయి. అందుకే, పాపం, అతనెక్కడికో పోయి మళ్ళీ యింటికి రాలేదు,'' అంది కమల.

''అమ్మాయి, శారీరక వాంఛలకు బానిసలైన మనుషులు అవినీతిపరులు అయే అవకాశం వుంది! మనిషి తన మానవత్వాన్ని కోల్పోకుండా వాంఛలను తీర్చుకోవాలి!'' అన్నారు వాలిగారు గంభీరంగా.

-: ఐపోయింది :-